# హెబ్రీయులకు వ్రాసిన పత్రిక 5వ అధ్యాయము

## వాక్య విషయములో క్రైస్తవ అనుభవమునందు యెదుగుట

ప్రతి ప్రధాన యాజకుడును మనుష్యులలో నుండిఏర్పరచబడిన వాడై, పాపములు కొరకు అర్పణలను బలులను అర్పించుటకు దేవుని విషయమైన కార్యములు జరిగించుటకై మనుష్యుల నిమిత్తము నియమింపబడును. 2 తాను కుడ బలహీనత చేత ఆవరింపబడియున్నందున అతడు ఏమియు తెలియని వారి యెడలను త్రోవ తప్పిన వారి యెడలను తాలిమి చూపగలవాడై యున్నాడు. 3 ఆ హేతువు చేత ప్రజల కొరకేలాగో ఆలాగే తన కొరకును పాపములు నిమిత్తము అర్పణము చేయవలసినవాడై యున్నాడు. 4 మరియు ఎవడును ఈ ఘనత తనకుతానే వహించు కొనడు గాని, అహరోను పిలువబడినట్టుగా దేవుని చేత పిలువబడినవాడై ఈ ఘనత పొందును. 5 అటువలె క్రీస్తు కుడ ప్రధానయాజకుడగుటకు తన్ను తానే మహిమపరచుకొన లేదు గాని – నీవు నా కుమారుడవు, నేను నేడు నిన్ను కనియున్నాను అని ఆయనతో చెప్పిన వాడే ఆయనను మహిమ పరచెను. 6 ఆ ప్రకారమే– నీవు మెల్కీసెదెకు యొక్క క్రమము చొప్పున నిరంతరము యాజకుడవై యున్నావు అని మరియొక చోట చెప్పుచున్నాడు. 7 శరీరధారియై యున్న దినములలో మహారోదనముతోను కన్నీళ్లతోను, తన్ను మరణము నుండి రక్షింపగల వానికి ప్రార్థనలను యాచనలను సమర్పించి, భయభక్తులు కలిగి యున్నందున ఆయన అంగీకరింపబడెను. 8 ఆయన, కుమారుడై యుండియు తాను పొందిన శ్రమల వలన విధేయతను నేర్చుకొనెను. 9 మరియు ఆయన సంపూర్ణసిద్ధి పొందినవాడై, మెల్కీసెదెకు యొక్క క్రమములోచేరిన ప్రధానయాజకుడని దేవుని చేత పిలువబడి10 తనకు విధేయులైన వారి కందరికిని నిత్యరక్షణకు కారకుడాయెను. 11 ఇందును గూర్చి మేము చెప్పవలసినవి అనేక సంగతులున్నవి గాని, మీరు వినుటకు మందులైనందున వాటిని విశదపరచుట కష్టము. 12 కాలమును బట్టి చూచితే మీరు బోధకులుగా ఉండవలసినవారై యుండగా, దేవోక్తులలో మొదటి మూలపాఠములను ఒకడు మీకు మరల బోధింపవలసి వచ్చెను. మీరు పాలు త్రాగవలసినవారే గాని బలమైన ఆహారము తినగలవారు కారు. 13 మరియు పాలు త్రాగు ప్రతివాడును శిశువే, గనుక నీతి వాక్యవిషయములో అనుభవము లేనివాడై యున్నాడు. 14 వయస్సు వచ్చిన వారు అభ్యాసము చేత మేలు కీడులను వివేచించుటకు సాధకము చేయబడిన జ్ఞానేంద్రియములు కలిగియున్నారు గనుక బలమైన ఆహారము వారికే తగును